'గోర్‌బోలీ'ని 8వ షెడ్యూల్‌లో చేర్చాలి

ఖైరతాబాద్, ఏప్రిల్ 8: లంబాడీల గోర్ బోలి భాషను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్లో చేర్చాలని గోర్ జీవన్ పరిరక్షణ సమితి మేనేజింగ్ ట్రస్ట్ ఎస్‌కే రామచంద్ర నాయక్ డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలోని 61 దేశాల్లో బంజారా భాష ఉందన్నారు. దేశంలోని 15 రాష్ట్రాల్లో మాట్లాడుతున్నారని, 12 కోట్ల మంది మాట్లాడే ఈ భాషను గుర్తించకపోవడం సరికాదన్నారు. ఈ విషయమై ఇప్పటికే వివిధ రాష్ట్రాల గవర్నర్లను కలిసి ఆయా రాష్ట్రాల ప్రభుత్వాల ద్వారా తీర్మాణం చేసి కేంద్రానికి పంపించాలని కోరామన్నారు. పాలక ప్రభుత్వాలు ఆ దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో మాజీ అడిషనల్ డీజీ డీటీ నాయక్, ఇన్‌కం ట్యాక్స్ కమిషనర్ జీవన్ లాల్, గిరిజన శక్తి అధ్యక్షులు వెంకటేశ్ చౌహాన్, ఎక్సైజ్ కమిషనర్ హరికిషన్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కోడింగ్‌లో ఉచిత శిక్షణ

బన్సీలాల్ పేట్, ఏప్రిల్ 8 : బీఎస్సీ, బీ.ఫార్మసీ, బీకాం పూర్తి చేసుకున్న నిరుద్యోగులకు మెడికల్ కోడింగ్, బిల్లింగ్ కోర్సులో ఉచిత శిక్షణ అందిస్తున్నామని అప్సా, టెక్ మహీంద్రా ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. మూడు నెలల ఈ కోర్సు పూర్తిచేసుకున్న ప్రతి ఒక్కరికీ ఉద్యోగ అవకాశాలను కల్పిస్తామని నిర్వాహకులు తెలిపారు. 21 నుంచి 27 ఏళ్ల వయసు కలిగిన యువతీయువకులు అర్హులని తెలిపారు. హబ్సిగూడ చౌరస్తా పిల్లర్ నెంబర్ 977 వద్ద ఉన్న తమ శిక్షణ కేంద్రంలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు సెల్ నెంబర్ 91549 90132, 91549 90131లలో సంప్రదించాలని కోరారు.

ప్రైవేట్ కళాశాలపై చర్యలు తీసుకోవాలి

దుండిగల్, ఏప్రిల్ 8: రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ కళాశాలలకు వేసవి సెలవులు ప్రకటించినప్పటికీ.. కొన్ని ప్రైవేట్ కళాశాలలు విద్యార్థులకు ప్రత్యేక క్లాసులు నిర్వహిస్తున్నాయని యూఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి బ్యాగారి వెంకటేశ్ ఆరోపించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. మేడ్చల్ జి పరిధిలోని కార్పొరేట్ విద్యాసంస్థలైన నారాయణ , శ్రీ చైతన్య, ఇతర కళాశాలు నిబంధనలకు విరుద్ధంగా మండు వేసవి కాలంలోనూ తరగతులు నిర్వహిస్తున్నయని అన్నారు. విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు .లేని పక్షంలో యూఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా కమిటీ పక్షాన విద్యాశాఖ కార్యాలయాల ముందు ఆందోళన చేపడతామన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్

చిక్కడపల్లి, ఏప్రిల్ 8: కేంద్రంలో ఎన్డీఏ సర్కార్ చేపడుతున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా మే 20న దేశవ్యాపితంగా చేపట్టనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కేంద్ర కార్మిక, రాష్ట్ర కార్మిక సంఘాల, స్వతంత్ర ఫెడరేషన్లు, అసోసియేషన్ల నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం బాగ్లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వారు రాష్ట్ర సదస్సునిర్వహించారు..ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్, బీఆర్‌టీయూ అధ్యక్షుడు జి.రాంబాబు యాదవ్, నాయకుడు మారన్న,కేంద్ర కార్మిక సంఘాల నాయకులు ఐఎన్‌టియుసి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.డి.చంద్రశేఖర్, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు యండీ యూసుఫ్, హెచ్ఎంఎస్ నాయకులు అంజద్, సిఐటియు నాయకులు సాయిబాబ, టియుసిఐ నాయకులు కె.సూర్యం, టిఎన్‌టియుసి నాయకులు ఎం.కె.బోస్, ఎఐయుటియుసి నాయకులు క్రిష్ణ, తదితరులు మాట్లాడారు. కార్మికవర్గ సమరశీల పోరాటాల ద్వారా గత 102 సంవత్సరాల నుండి పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలలో.. కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను సమూలంగా రద్దు చేసి 4 లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి అమలు చేసేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ఈ విధానాలకు కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు,అసోసియేషన్లు 2025 మే 20న దేశవ్యాపితంగా సార్వత్రిక సమ్మె చేయాలని నిర్ణయించాయని తెలిపారు. ఈ సార్వత్రిక సమ్మెకు సంయుక్త కిసాన్‌మోర్చ సంపూర్ణ మద్దతు ప్రకటించిందని అన్నారు. ఈ సదస్సులో ఐఎన్‌టియుసి వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ కుమార్ యాదవ్, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు యండీయూసుఫ్, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్కరాములు, టియుసిఐ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.ఎల్.పద్మ, టిఎన్‌టియుసి, బిఆర్‌టియు, ఎఐయుటియుసి నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ అతిథ్యానికి వన్నె తెచ్చేలా మిస్ వరల్డ్ పోటీలు

- హైదరాబాద్‌కు రానున్న 120 దేశాల మోడళ్లు
- చార్మినార్ వద్ద హెరిటేజ్ వాక్, చౌమొహల్లా ప్యాలెస్‌లో వెల్కమ్ డిన్నర్
- అధికారులతో సమీక్షించిన టూరిజం సెక్రెటరీ స్మిత సబర్వాల్

హైదరాబాద్, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో టూరిజం బ్రాండ్ పెరిగేలా, తెలంగాణ అతిథ్యానికి వన్నె తెచ్చేలా మిస్ వరల్డ్ పోటీలు ఉండాలని తెలంగాణ టూరిజం శాఖ సెక్రెటరీ స్మిత సభర్వాల్ ఆ శాఖ అధికారులను ఆదేశించింది. మిస్ వరల్డ్ పోటీలు నిర్వహిస్తున్న నేపథ్యంలో హైదరాబాద్‌కు వచ్చే మోడళ్ల స్వాగత ఏర్పాట్లపై మంగళవారం ఆమె అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మే 7 నుంచి 31 వరకు నిర్వహించనున్న 72వ మిస్ వరల్డ్ పోటీలు తెలంగాణ టూరిజం ఆధ్వర్యంలో జరుగుతున్నాయని, ఈ పోటీలకు 120 దేశాలకు చెందిన మోడళ్లు మే 6, 7న నగరానికి చేరుకుంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఛార్మినార్ వద్ద హెరిటేజ్ వాక్, చౌమొహల్లా ప్యాలెస్‌లో వెల్కమ్ డిన్నర్ ఏర్పాట్ల కోసం టూరిజం, జీహెచ్ఎంసీ, హెరిటేజ్, పోలీసు ఆఫీసర్లతో ప్యాలెస్‌లో క్షేత్ర స్థాయి లో పర్యటించారు. ఈ సందర్భంగా 120 మంది మోడల్స్‌తో పాటు వారితో 400 మంది ప్రతినిధులు, ఫోటోగ్రాఫర్లు, అంతర్జాతీయ మీడియా ప్రతినిధులు పాల్గొనున్నారు. ఈవెంట్ ప్రత్యేకతలు చాటేలా కార్యక్రమాలు ఉండాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ప్యాలెస్‌లో ఫోటోషూట్, సీటింగ్ ఏర్పాట్లు, లైవ్ మ్యూజిక్ కాంటెస్ట్, సూఫీ మ్యూజిక్, కవ్వాలీ సంగీత ప్రదర్శన, తెలంగాణ సాంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడేలా 20నిమిషాలు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. నిజాం వంటకాలు, తెలంగాణ రుచులు సైతం భోజనం మెనులో ఉంటాయన్నారు. ఈ సమీక్ష సమావేశంలో టూరిజం శాఖ డైరెక్టర్ హనుమంతు, యువజనుల సర్వీసుల శాఖ డైరెక్టర్ వాసం వెంకటేశ్వర్లు, శిల్పారామం స్పెషల్ ఆఫీసర్ కిషన్‌రావు, సెట్విన్ ఎండి వేణుగోపాల్, టూరిజం, పోలీస్, జీహెచ్ఎంసీ అధికారులు పాల్గొనున్నారు.

ఓయూ విద్యార్థులను కేసుల పేరుతో వేధిస్తున్నారు

బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చటారి దశరథ్

ఉస్మానియా యూనివర్సిటీ: రైతుల పక్షాన ఉద్యమించిన నేరానికి వాళ్లంతా న్యాయస్థానాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ఇదే ప్రజా పాలనా అని ప్రశ్నించిన నెపానికి చదువుకు దూరమవ్వాల్సిన పరిస్థితిని ప్రభుత్వం కల్పించింది. ప్రతిష్టాత్మక ఉస్మానియా యూనివర్సిటీలో సీటు సంపాదించి ఉన్నత చదువులు అభ్యసిస్తున్న పలువురు విద్యార్థి నాయకులు ప్రజా ప్రభుత్వంలో లగచర్ల రైతుల భూములను లాక్కుంటూ వారిపై రేవంత్ ప్రభుత్వం జరిపిన దాష్టీకాన్ని వ్యతిరేకిస్తూ ఓయూ వేదికగా నిరసన తెలిపగా.. గతంలో ప్రభుత్వం వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసింది. ప్రభుత్వ పెద్దలు ఘనంగా చెప్పుకుంటున్న ఇందిరమ్మ రాజ్యం మోపిన తప్పుడు కేసులను ఎదుర్కొనేందుకు విద్యార్థులు న్యాయస్థానాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఆయా కేసులకు సంబంధించి నాంపల్లి క్రిమినల్ కోర్టులో ఓయూ విద్యార్థి నేతలు మంగళవారం కోర్టులో హాజరయ్యారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చటారి దశరథ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎన్ని తప్పుడు కేసులు మోపినా తాము విద్యార్థులు, రైతులు, ప్రజలకు మద్దతుగా పోరాడుతూనే ఉంటామని స్పష్టం చేశారు. విద్యార్థులకు ఎల్లవేళలా అండగా ఉంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు జంగయ్య, నాగారం ప్రశాంత్, శ్రీకాంత్, అవినాష్, శ్రీను నాయక్, రమేష్, నాగేందర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కండ్లకోయ ఐటీ పార్క్ కలేనా..?

- 2022లో ఐటీ మంత్రి కేటీఆర్ చేతులమీదుగా శంకుస్థాపన
- నిర్మాణ పనులను పట్టించుకోని రేవంత్ సర్కార్
- అనుమతుల జారీలో హెచ్ఎండీఏ నిర్లక్ష్యం

కండ్లకోయలో ఏర్పాటు చేయబోయే ఐటీ పార్క్ బిల్డింగ్ నమూన చిత్రం

మేడ్చల్, ఏప్రిల్ 8(నమస్తే తెలంగాణ): కండ్లకోయ ఐటీ పార్క్ నిర్మాణ పనులలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోంది. హైదరాబాద్ నగరానికి నాలుగు వైపులా ఐటీ రంగాన్ని విస్తరించేలా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కండ్లకోయలో 12 ఎకరాల విస్తీర్ణంలో ఐటీ పార్క్‌ను ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టింది. అందులో భాగంగా 2022 సంవత్సరంలో కండ్లకోయ ఐటీ పార్క్ ఏర్పాటుకు అప్పటి ఐటీ మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేయడంతో పాటు నిధులను మంజూరు చేసి టెండర్లను ఆహ్వానించిన విషయం విదితమే. వాస్తవానికి 2026 సంవత్సరంలో ఐటీ పార్క్ నిర్మాణం పూర్తి కావాల్సి ఉండగా.. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత నుంచి ఐటీ పార్క్ నిర్మాణ పనులు నత్త నడకన సాగుతున్నాయి. ఆ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా తయారయ్యాయి. ఈ క్రమంలో ఐటీ పార్క్ నిర్మాణ పనులు ఎప్పుడు పూర్తవుతాయో అన్నది ప్రశ్నార్థకరంగా మారింది.

అనుమతుల జారీలో నిర్లక్ష్యం..

ఐటీ పార్క్ నిర్మాణ పనులకు సంబంధించి వివిధ శాఖల నుంచి అనుమతి లభించినప్పటికీ హెచ్ఎండీఏ అనుమతి ఇవ్వడంలో నిర్లక్ష్యంగా వ్యహరిస్తున్న కారణంగా పనులు నత్తనడకన సాగుతున్నట్లు విమర్శలున్నాయి. హెచ్ఎండీఏ ఉన్నతాధికారులపై ప్రజాప్రతినిధుల ఒత్తిడి తెచ్చి వెంటనే అనుమతులు ఇచ్చేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు. కండ్లకోయ ఐటీ పార్క్ శంకుస్థాపన సమయంలోనే ఐటీ కంపెనీల ఏర్పాటుకు దాదాపు 100 వరకు కంపెనీలు రిజిస్ట్రేషన్లు చేసుకున్నాయి. ఐటీ పార్క్ నిర్మాణం పూర్తయితే సుమారు 200 వరకు ఐటీ కంపెనీల ఏర్పాటుకు అనువుగా ఉండేలా నమూనను అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం సిద్ధం చేసింది. ఇది కార్యరూపం దాల్చి ఉంటే వేలాది సంఖ్యలో ఐటీ ఉద్యోగాల కల్పన జరగడంతో పాటు మేడ్చల్ ప్రాంతం మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉండేదన్నారు. దీనికి తోడు ఈ ప్రాంతంలో వ్యాపారాలు వృద్ధి చెంది అనేక మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించేదన్నారు. ఐటీ పార్క్ పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కైటీయ అధ్యక్షుడు ఒరుగంటి వెంకటేశ్వర్లు ఇటీవల జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. వీలైనంత త్వరగా ఐటీ పార్కు నిర్మాణం చేపట్టి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు స్థానిక అభివృద్ధికి సహకరించాలని కోరారు.

హనుమాన్ శోభాయాత్రకు పకడ్బందీ ఏర్పాట్లు: సీపీ

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్

సిటీబ్యూరో, ఏప్రిల్ 8(నమస్తే తెలంగాణ): ఈనెల 12న జరగనున్న శ్రీ వీరహనుమాన్ విజయయాత్ర(శోభాయాత్ర) సందర్భంగా మంగళవారం హైదరాబాద్ పోలీస్ అధికారులతో సిటీ పోలీస్ కమిషనర్ సివి ఆనంద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గతంలో జరిగిన విజయయాత్ర సందర్భంగా జరిగిన సంఘటనలు, బందోబస్త్ ఏర్పాట్లపై చర్చించి వాటి అనుభవాల నేపథ్యంలో ఈసారి యాత్రను విజయవంతం చేయడానికి కావలసిన సూచనలు చేశారు. చిన్న ఊరేగింపులు అనుసంధాన మయ్యే కూడళ్ల వద్ద , మతపరమైన ప్రదేశాల వద్ద, సమస్యాత్మకమైన ప్రాంతాల్లో ప్రత్యేక అదనపు బలగాలను మోహరించి నిరంతరం నిఘా కొనసాగించాలని సూచించారు.ఈ కాన్ఫరెన్స్‌లో లా అండ్ ఆర్డర్ అడిషనల్ కమిషనర్ విక్రమ్ సింగ్ మాన్, స్పెషల్ బ్రాంచ్ డీసీపీ చైతన్యకుమార్, ఐటీ సెల్ డీసీపీ పుష్ప మరియు వర్చువల్‌గా జోనల్ డీసీపీలు, ఏసీపీలు, ఎస్‌హెచ్‌ఓలు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

- ఓయూ కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం
- అడ్మినిస్ట్రేషన్ భవనం ఎదుట నిరసన

ఓయూ అడ్మినిస్ట్రేషన్ ఆఫీస్ ఎదుట బైఠాయించి నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 8: రాష్ట్రంలోని 12 యూనివర్సిటీలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులకు తక్షణమే ఉద్యోగ భద్రత కల్పించాలని పలువురు అధ్యాపకులు డిమాండ్ చేశారు. యూనివర్సిటీల కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉస్మానియా యూనివర్సిటీలో కాంట్రాక్ట్ అధ్యాపకులు మంగళవారం తరగతులు బహిష్కరించి యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ భవనం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. సంఘం నాయకులు డాక్టర్ సీమర్ల విజేందర్ రెడ్డి, డాక్టర్ ధర్మతేజ మాట్లాడుతూ..యూనివర్సిటీ కాంట్రాక్టు టీచర్ల సమస్య పరిష్కరించకుండా జీవో 21ను తీసుకువచ్చారని.. ఇది యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా ఉందని ఆరోపించారు. తక్షణమే ఆ జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో తమ సమస్యలను పరిష్కరిస్తామన్న కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ అధ్యాపకులు డాక్టర్ రేష్మారెడ్డి, డాక్టర్ మోడెం రవి, డాక్టర్ ఓ కృష్ణయ్య, డాక్టర్ తాలపల్లి వెంకటేశ్, డాక్టర్ మహేందర్, డాక్టర్ అరుణ్, డాక్టర్ కిరణ్, డాక్టర్ అశోక్, డాక్టర్ వాణి, డాక్టర్ హరీశ్, డాక్టర్ అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా వర్సిటీలో తరగతుల బహిష్కరణ

జియాగూడ, ఏప్రిల్ 8: తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించడంతో పాటు జీవో 21ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కోఠిలోని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలోని కాంట్రాక్ట్ అధ్యాపకులు మంగళవారం తరగతులు బహిష్కరించి ఆందోళనకు దిగారు. ఆ వర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకుల జేఏసీ కన్వీనర్ ఉపేందర్‌రావు మాట్లాడుతూ..కాంట్రాక్టు అధ్యాపకుల సేవలను పూర్తి స్థాయిలో పర్యవేక్షించిన తర్వాతే మాత్రమే... కొత్త నియామకాలకు నోటిఫికేషన్ ఇవ్వాలని కోరారు. ఈ ధర్నాలో కాంట్రాక్ట్ అధ్యాపకులు డాక్టర్ ఈ ఉపేందర్ రావ్, డాక్టర్ వినీత పాండే, డాక్టర్ రజిని, డాక్టర్ సనత్, డాక్టర్ రవి, డాక్టర్ సునీత, జ్యోతి, డాక్టర్ కృష్ణ వేణి, డాక్టర్ కృష్ణాజి, డాక్టర్ శేఖర్ రెడ్డి, డాక్టర్ ఆనంద్ పాల్గొన్నారు.

లష్కర్ జిల్లా సాధనకు కృషి

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

ఎమ్మెల్సీ కవితతో సమావేశమైన లష్కర్ జిల్లా సాధన సమితి నాయకులు

సికింద్రాబాద్, ఏప్రిల్ 8 : లష్కర్ జిల్లా సాధనకు తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. మంగళవారం లష్కర్ జిల్లా సాధన సమితి ప్రతినిధుల బృందం బంజారాహిల్స్‌లోని ఆమె నివాసంలో కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ప్రజలకు పాలనను మరింత చేరువ చేసేందుకు బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ రాష్ట్రంలో పలు నూతన జిల్లాలను ఏర్పాటు చేశారాని కవిత గుర్తు చేశారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ తిరిగి అధికారంలోకి వస్తుందని.. అప్పుడు తప్పకుండా సికింద్రాబాద్ ప్రత్యేక జిల్లా ఏర్పాటుకు కృషి చేస్తానని కవిత హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఈ విషయంపై సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాయడంతో పాటు వచ్చే అసెంబ్లీ సమావేశంలో కౌన్సిల్‌లో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని లష్కర్ సాధన సమితి ప్రతినిధులకు ఆమె హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో సమితి అధ్యక్షులు గుర్రం పవన్ కుమార్ గౌడ్, ప్రధాన కార్యదర్శి సాధం బాలరాజ్ యాదవ్, శైలందర్, సునీల్ ముదిరాజ్, శ్రీకాంత్ రెడ్డి, అశోక్ చారి, కృష్ణ ముదిరాజ్ తదితరులు ఉన్నారు.

ఆపరేషన్ కగార్‌ను ఎత్తివేయాలి

- మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలు జరపాలి
- ఇందిరాపార్కు వద్ద ప్రజాధర్నాలో వక్తల డిమాండ్

ప్రజాధర్నాలో మాట్లాడుతున్న ఆచార్యులు రమా మెల్కోటే

కవాడిగూడ, ఏప్రిల్ 8: బస్తర్ ప్రాంతంలో కొనసాగుతున్న నరమేధం ఆదివాసి జాతి అంతానికి తప్పితే వారి సంక్షేమానికి ఎంత మాత్రం కాదని పలువురు వక్తలు అన్నారు. చత్తీస్‌గఢ్ రాష్ట్రంలో కొనసాగుతున్న ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఎత్తివేసి ఆదివాసుల్ని రక్షించడం తోపాటు కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో శాంతి చర్చలు ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద మంగళవారం ప్రజాధర్నా నిర్వహించారు. సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర సెక్రటేరియట్‌సభ్యులు సాధినేని వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ ప్రజాధర్నా కార్యక్రమంలో విశ్రాంత ఆచార్యులు రమామెల్కోటే, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి జే.వి.చలపతిరావు, టీజేఎస్ నాయకులు ఆచార్య కోదండరాం, ఆప్ కన్వీనర్ డాక్టర్ సుధాకర్, సీపీఐ నాయకురాలు పశ్య పద్మ, సీపీఎం నాయకులు జూలకంటి రంగారెడ్డి, సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ నాయకురాలు కే రమా, ఎంసీపీఐ (యు) నాయకులు మట్టయ్య, లిబరేషన్ నాయకులు రమేష్‌రాజా, రెడ్‌ఫ్లాగ్ నాయకులు రాజేశ్, అరుణోదయ విమల, ఆచార్య ఖాసీం, ఆచార్య వినాయకరెడ్డి, కన్నగంటి రవి, కె.సజయ, మురళీ కృష్ణ, వి.సంధ్య, కె.గోవర్ధన్, అంబటి నాగయ్య, కవి విశ్వనాథుల పప్పగిరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆచార్యులు రమా మెల్కోటే మాట్లాడుతూ.. చత్తీస్‌గఢ్‌లో ఆదివాసీలపై కొనసాగుతున్న హత్యాకాండను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆపివేయాలన్నారు. జే.వీ.చలపతిరావు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరిపేందుకు ముందుకు రావాలన్నారు.

ఆకట్టుకున్న టయోటా మైలేజీ ర్యాలీ

విజేతకు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

సిటీబ్యూరో, ఏప్రిల్ 8: హర్ష టయోటా, ఫార్చున్ టయోటా ఆధ్వర్యంలో హైబ్రిడ్ టెక్నాలజీతో 40 టయోటా హైరైడర్ వెహికల్స్‌తో సుమారు 50 కిలోమీటర్ల మేర జరిగిన మైలేజీ ర్యాలీ మంగళవారం ముగిసిందని నిర్వాహకులు తెలిపారు. సంధ్య థియేటర్ నుంచి వండర్లా వరకు జరిగిన ర్యాలీలో వాహనాల ఫ్యూయెల్ ఎఫిషియెన్సీని పరిశీలించినట్టు పేర్కొన్నారు. 37 కిలీ మీటర్ల మైలేజీ రికార్డైనట్టు పేర్కొన్నారు. సస్టెనెబుల్ మొబిలిటీ, బాధ్యతగల డ్రైవింగ్‌పై అవగాహన కల్పించామని తెలిపారు.

విత్తన చట్టాన్ని తీసుకురావాలి

ఖైరతాబాద్, ఏప్రిల్ 8: నాణ్యమైన విత్తనాల సరఫరా, ప్రైవేట్ కంపెనీల నకిలీలను అరికట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం విత్తన చట్టాన్ని తీసుకోవాలని సెంటర్ ఫర్ గ్రీన్ రెవెల్యూషన్ ప్రతినిధి దిలీప్ రెడ్డి కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పబ్లిక్ పాలసీ నిపుణులు డాక్టర్ దొంతి నర్సింహా రెడ్డితో కలిసి ఆయన మాట్లాడుతూ.. జన్యు మార్పిడి విత్తనాల వల్ల రైతులు, భూమికి తీరని నష్టం జరుగుతుందని, అలాంటి విత్తనాలపై నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలన్నారు. ఈ నెల 5, 6న ఆన్మాస్‌పల్లిలోని ది ఎర్త్ సెంటర్‌లో నిర్వహించిన విత్తన పండుగ విజయవంతమైందన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయాల్లో దేశీ విత్తనాలపై పుస్తకాలు ప్రచురించి విద్యార్థులకు అందజేయాలన్నారు. ఈ సమావేశంలో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవెల్యూషన్ వ్యవస్థాకులు కె. లక్ష్మా రెడ్డి, అధ్యక్షురాలు కె. లీలా లక్ష్మా రెడ్డి, ప్రొఫెసర్ పురుషోత్తమ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామరాజు సేవలు చిరస్మరణీయం

తెలంగాణ సారస్వత పరిషత్తు అధ్యక్షులు ఆచార్య శివారెడ్డి

తెలుగు యూనివర్సిటీ, ఏప్రిల్ 8: నిజాం వ్యతిరేక పోరాటంలో పాల్గొని యోధుడిగా నిలిచిన ఆచార్య బిరుదురాజు రామరాజు దక్షిణ భారతదేశంలోనే జానపద విజ్ఞాన పరిశోధనలో మొట్టమెదటివాడిగా పేరు ప్రఖ్యాతలు గడించారని తెలంగాణ సారస్వత పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అన్నారు. ఆబిడ్స్ బొగ్గుల కుంటలో గల తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో పరిషత్తు ప్రాంగణంలోని ఆడిటోరియంలో మంగళవారం ఆచార్య బిరుదురాజు రామరాజు శతజయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య ఎల్లూరి శివారెడ్డి మాట్లాడుతూ.. ఓయూ తెలుగు శాఖలో ఆచార్యులుగా బిరుదురాజు రామరాజు స్నాతకోత్తర పాఠాలు భోధించారని గుర్తు చేసుకున్నారు. శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం కార్యదర్శి టీఉడయవర్లు ప్రసంగిస్తూ రామరాజు గొప్ప పరిశోధకులని పేర్కొన్నారు. సంస్కృతం, తెలుగు ప్రాచీన గ్రంథాలను అన్వేషణ చేసిన రామరాజు పరిష్కరణ కర్తగా బహుముఖీనమైన సేవలు అందించారని అన్నారు. రామరాజు మనమరాలు, తెలుగు విశ్వవిద్యాలయం నృత్యశాఖ అధ్యక్షురాలు డాక్టర్ కె. రత్నశ్రీ, పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె. చెన్నయ్య, ప్రాచ్య కళాశాల ప్రధానాచార్యులు ఏ.సిల్మానాయక్ పాల్గొన్నారు.

సాహిత్యాన్ని సృష్టించే కవి సిధారెడ్డి

ఆచార్య అనుమాండ్ల భూమయ్య

రవీంద్రభారతి,ఏప్రిల్ 8: ఆచార్య చెన్నకేశవరెడ్డి 81వ జన్మదినాన్ని పురస్కరించుకొని మంగళవారం ఆచార్య చెన్నకేశవరెడ్డి సాహిత్య పురస్కారాన్ని కవి నందిని సిధారెడ్డికి రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో అందజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య అనుమాండ్ల భూమయ్య జ్యోతి ప్రజ్వలన చేసి నందిని సిధారెడ్డికి చెన్నకేశవరెడ్డి సాహిత్య పురస్కారాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. హృదయం ద్రవీభవింపజేసే సాహిత్యాన